

కారు బీభత్సం

ఓ కారు బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చి రోడ్డు పక్కన నిలబడిన వారిని ఢీకొట్టి ఫుట్‌పాత్‌లపైకి దూసుకెళ్లింది. 8లో▸



గుర్తింపు రద్దు చేయాలి

ఇక్ఫాయ్ డీమ్డ్ యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని బీఆర్‌ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



ఉపాధ్యాయులే..

విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు అవుతారని చేవెళ్ల ఏసీపీ కిషన్ పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు చిలుకూరు బాలాజీ దేవాలయం మూసివేత



మొయినాబాద్: చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం 4 నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. గ్రహణం ముగిసిన తరువాత ఆలయ సంప్రోక్షణ, అభిషేకం నిర్వహించి భక్తులకు స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు.

ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడిగా వెంకట్‌రాంరెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్‌కు చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డిని నియమించారు. ఈ మేరకు శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన అధ్యక్షుడిగా నియమితుడైన వెంకట్‌రాంరెడ్డి ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా బాలాజీ



అవార్డు అందుకుంటున్న బాలాజీ

చేవెళ్ల: మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కె.బాలాజీ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తెలంగాణ విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు. తనను ఎంపిక చేసిన అధికారులు, సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మా భూముల్లో ‘రీజినల్’ వద్దు



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న దేవరాంపల్లి రైతులు

అనంతగిరి: ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని దేవరాంపల్లి రైతులు కోరారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రీజినల్ రింగ్‌రోడ్డు ప్రతిపాదిత భూముల జాబితాలో మా గ్రామం ఉందని, పేద రైతులకు చెందిన పొలాలు ఉన్నాయని తెలిపారు. భూములు కోల్పోతే ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వేరే ప్రాంతం నుంచి ప్రతిపాదించాలని కోరారు. వ్యవసాయంపై పూర్తిగా ఆధారపడి జీవిస్తున్నామని, భూములు పోతే ప్రత్యామ్నాయం లేదని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఏ మాత్రం సరిపోదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు మా గ్రామాన్ని రెండు భాగాలుగా విభజిస్తుందన్నారు. రైతులకు నష్టం జరగని ప్రాంతాల నుంచి రోడ్డును ప్రతిపాదించాలని వారు కోరారు. ఈ విషయమై తాను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని స్పీకర్ హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

శోభాయాత్రకు.. సర్వం సిద్ధం

బాలాపూర్ నుంచి ట్యాంక్ బండ్ వరకు..



తుర్కయంజాల్: మాసబ్‌చెరువు వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్

- వేలాదిగా తరలిరానున్న వినాయక విగ్రహాలు
- దారి పొడవునా భారీ బందోబస్తు.. ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఆంక్షలు
- సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్, మాసబ్ చెరువు వద్ద ఏర్పాట్లు


సాక్షి, రంగారెడ్డిజిల్లా: గణేశుడి శోభాయాత్రకు సర్వం సిద్ధమైంది. తొమ్మిది రోజుల పాటు అశేష భక్తజనం పూజలు అందుకున్న వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఉదయం పూజలు నిర్వహించి, ఇప్పటికే సిద్ధం చేసుకున్న వాహనాల్లో ఆయా వినాయకులను సమీప చెరువులు, కుంటలకు తరలించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. శనివారం శోభాయమానంగా నిర్వహించే వేడుకలకు భారీ పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో బాలాపూర్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు నిర్వహించే శోభయాత్రకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దారి పొడవునా స్వాగత ద్వారాలు, ట్యాంక్‌బండ్ సహా సరూర్‌నగర్, తుర్కయంజాల్ మాసబ్ చెరువుల వద్ద భారీ క్రేన్లను సిద్ధం చేశారు. ఎలాంటి అంతరాయాలకు ఆస్కారం ఇవ్వకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కోసం విద్యుత్‌శాఖ ఆయా చెరువులు, కుంటల వద్ద అదనపు ఏర్పాట్లు చేసింది.

మినీట్యాంక్ బండ్‌పై..

సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై ఎనిమిది క్రేన్లు సిద్ధం చేశారు. కట్ట మొత్తం ఇప్పటికే విద్యుత్ దీపాలతో అలంకరించారు. నిరంతర నిఘా కోసం 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 3,504 విగ్రహాలు నిమజ్జనమైనట్లు అధికారులు తెలిపారు. చివరి రోజైన శనివారం మరో మూడు వేలకుపైగా విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, ఎన్టీఆర్ కాలనీ, నాగోలు, ఎల్బీనగర్ మీదుగా వచ్చే వాహనాలను కర్మన్‌ఘట్ మీదుగా సరూర్‌నగర్ ట్యాంక్‌బండ్ వైపు అనుమతించనున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్‌శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించనున్నారు.

తుర్కయంజాల్ మాసబ్ చెరువు కట్టపై..

తుర్కయంజాల్ మాసబ్ చెరువు కట్టపై ఒక క్రేన్ ఏర్పాటు చేశారు. భక్తులు, ఇతర సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. కట్టపై భారీ విద్యుత్ లైట్లు సహా వైద్య శిబిరం, విద్యుత్ కాల్ సెంటర్, జలమండలి ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా వంటి ఏర్పాట్లు చేశారు. తుర్కయంజాల్, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది సహా ఇతర అధికారులకు ఇక్కడ విధులు కేటాయించారు. గజ ఈతగాళ్లను సైతం సిద్ధంగా ఉంచారు.



బాలాపూర్ రూట్ మ్యాప్..

బాలాపూర్ గణనాథుడి శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను ఉత్సవ సమితి నిర్వాహకులు విడుదల చేశారు.

- శనివారం ఉదయం తెల్లవారుజామున 4.45 గంటలకు కమిటీ సభ్యులు గణనాథుని వద్దకు చేరుకుంటారు.
- 5 గంటలకు చివరి ఘట్టం పూజ నిర్వహించి 5.30 గంటలకు పూర్తి చేస్తారు.
- 5.30 నుంచి 6.30 వరకు గణనాథుడిని ఓపెన్ డీసీఎంలో ఎక్కించే ఏర్పాట్లు పూర్తి చేస్తారు.
- 6.30 నుంచి 8.30 గంటల వరకు గ్రామంలోని పుర వీధుల మీదుగా భజనలతో ఊరేగింపు నిర్వహిస్తారు.
- 9 గంటలకు ఊరి బొడ్రాయి వద్దకు చేరుకుంటారు. అక్కడే భక్తులనుద్దేశించి ప్రముఖులు ప్రసంగిస్తారు.
- 9.30కు వేలం పాట మొదలుపెట్టి 10 గంటలకు పూర్తి చేస్తారు.
- 10 నుంచి 10.30 గంటల వరకు డీసీఎం నంచి గణనాథుడిని ట్రక్‌లోకి మారుస్తారు. అక్కడి నుంచి శోభాయాత్ర మొదలవుతుంది.
- పాతబస్తీ, బార్కస్, కట్టమైసమ్మ టెంపుల్, కేశవగిరి, చాంద్రాయణగుట్ట ఎక్స్‌రోడ్, మహబూబ్‌నగర్ ఎక్స్‌రోడ్, ఇంజన్‌బౌలి, అలియాబాద్, నాగుల్‌చింత జంక్షన్, హిమ్మత్‌పురా, నుంచి అలియాబాద్, చార్మినార్, మదీనా క్రాస్‌రోడ్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, అబిడ్స్, జీపీవో, జీజేఆర్ విగ్రహం, బషీర్‌బాగ్ క్రాస్‌రోడ్, లిబర్టీ, అంబేడ్కర్ విగ్రహం మీదుగా ట్యాంక్‌బండ్ తీరానికి చేరుకుంటుంది.

❖ నేలకొరిగిన 400 ఏళ్ల రావి చెట్టు



మండల పరిధిలోని బాచుపల్లిలో 400 ఏళ్ల పైగా వయసున్న పురాతన రావి చెట్టు నేలకూలింది. శుక్రవారం ఉదయం హనుమాన్ దేవాలయం ముందున్న వృక్షం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న రావి చెట్టు నేలకూలడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చెట్టుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. – కందుకూరు

❖ అదే ‘వరుస’



యూరియా కోసం అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. నందిగామలోని పీఏసీఎస్ ఎదుట శుక్రవారం ఉదయమే పెద్ద ఎత్తున క్యూ కట్టారు. యూరియా లోడ్ వచ్చిందనే విషయం తెలుసుకున్న పరిసర గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారేసరికి ఎగబడ్డారు. 450 బస్తాలు మాత్రమే రావడంతో ఏ మాత్రం సరిపోలేదు. దీంతో అక్కడికి వచ్చిన వారు పీఏసీఎస్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. రెండు మూడు రోజుల్లో మరింత వస్తుందని వారు సర్దిచెప్పి పంపించారు. – నందిగామ

❖ సీఎం చేతుల మీదుగా..



తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న రాధిక, రాజేందర్, హారిక గ్రామ పరిపాలన అధికారులుగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వారికి నియామక పత్రాలు అందజేశారు. – కడ్తాల్



విజేతలతో పుల్లెల గోపీచంద్

కన్హాలో ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

నందిగామ: మండల పరిధిలోని కన్హా శాంతివనంలో బీఏటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న యోనెక్స్ సన్‌రైజ్ 79వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్–2025 పోటీలు శుక్రవారంతో ముగిసాయి. విజేతలకు పుల్లెల గోపీచంద్ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సాధారణమేనని అన్నారు. ఒక ఓటమి మరో విజయానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. పురుషుల విభాగం సింగిల్స్‌లో తమిళనాడుకు చెందిన రిత్విక్ విన్నర్‌గా, కేరళకు చెందిన గోవింద్ రన్నర్‌గా, మహిళల సింగిల్స్ విభాగంలో కర్ణాటకకు చెందిన సైనా విన్నర్‌గా, కర్ణాటకకే చెందిన రాజేష్ లక్షా రన్నర్‌గా నిలిచారని తెలిపారు. పురుషుల డబుల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీవీహెచ్ వర్ధన్ రాయుడు, విష్ణుకేదార్ విన్నర్‌గా, పాండిచ్చేరికి చెందిన కృష్ణన్ మిత్లేష్, ప్రీజన్ రన్నర్‌గా నిలిచినట్లు వెల్లడించారు. మహిళల డబుల్స్ విభాగంలో తమిళనాడుకు చెందిన రిద్‌వర్షిణి, సింకేదర్ సానై విన్నర్‌గా, తెలంగాణకు చెందిన ఆలీషా మహమూద్, వైష్ణవి రన్నర్‌గా నిలిచినట్టు వివరించారు.

రేషన్ షాపుల బంద్ విజయవంతం

ఇబ్రహీంపట్నం: తమ సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్లు శుక్రవారం నిర్వహించిన ఒక రోజు బంద్ విజయవంతమైంది. డివిజన్ పరిధిలోని డీలర్లు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు భానుగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే కమీషన్ రెండూ కలిపి ఒకేసారి విడుదల చేయాలని కోరారు.



ఇబ్రహీంపట్నంలో మూసివేసిన రేషన్ దుకాణం

హైడ్రా పేరిట టోకరా

ముగ్గురిపై కేసు నమోదు

పహాడీషరీఫ్: హైడ్రా అధికారులతో మాట్లాడి పొలం పంచాయతీ పరిష్కరిస్తామంటూ మహిళ నుంచి రూ.50 లక్షలు వసూలు చేసిన ముగ్గురు నిందితులపై పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ మంఖాల్ గ్రామ పరిధిలోని 122, 136, 137, 141 నంబర్లలో చైతన్య పన్నాల అనే మహిళకు 7.15 ఎకరాల పట్టా భూమి ఉంది. ఇందులో వర్టెక్స్ డెవలపర్స్ వెంచర్ నిర్వాహకులు 150 ఫీట్ల రోడ్డు వేశారు. ఈ విషయమై ఆమె ప్రశ్నిస్తున్న క్రమంలో దగ్గరి బంధువైన ప్రవీణ్ హైడ్రా అధికారులకు పరిచయమున్న తన స్నేహితుడు యూట్యూబ్ చానెల్ లీగల్ అడ్వైజర్ సుంకరి నరేష్ అన్నీ చూసుకుంటాడని నమ్మించాడు. సాయి శ్రీనివాస్ అనే స్నేహితుడిని జత చేసుకొని ఆమె నుంచి రెండు దఫాలుగా రూ.50 లక్షలు వసూలు చేశారు. తర్వాత ముఖం చాటేయడంతో చివరికి ఆమె హైడ్రా అధికారులను ఆశ్రయించింది. దీనిపై విచారించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఆ కార్యక్రమాలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

కందుకూరు: తెలంగాణ సాయుధ పోరాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో శుక్రవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుబ్బాక రాంచందర్ అధ్యక్షతన జిల్లా కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10 నుంచి 17 వరకు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా సభలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈనెల 17న ఖమ్మం జిల్లా జనగామలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి అఖిల భారత కార్యదర్శి ఎంఏ బేబి ముఖ్యఅతిథిగా హాజరవుతారని వెల్లడించారు. ఈనెల 12న సీతారాం ఏచూరి వర్ధంతిని అన్ని జిల్లాలు, మండలాల్లో జరుపుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.సామేల్, చంద్రమోహన్, కె.జగన్, ఇ.నరసింహ, కె.భాస్కర్, జగదీశ్, కవిత పాల్గొన్నారు.

పార్కు స్థలం పరాధీనం!

- దర్జాగా ప్రహరీ నిర్మాణం
- రూ.12 కోట్ల విలువైన భూమి కబ్జా
- ఆదిబట్లలో అక్రమార్కుల నిర్వాకం

ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీలుగా ఉన్నప్పుడు కాపాడిన పార్కు స్థలాలు మున్సిపాలిటీలోకి చేరే సరికి మాయమైపోతున్నాయి. అధికారుల ఉదాసీన వైఖరితో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి, లేఔట్లు మార్చేసి కబ్జాలకు పాల్పడుతున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ ఏర్పడక ముందు 2017లో శ్రీమిత్ర ఎస్టేట్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యం సర్వే నంబర్ 72,73,74,75,76,77 పార్టుల్లో పార్కు స్థలాలను కేటాయించింది. మొత్తం 49.30 ఎకరాలు వెంచర్ చేయగా అందులో నిబంధనల ప్రకారం ఐదెకరాల పార్కు స్థలాలు చూపించారు. 2012లో పార్కు స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని అప్పటి జిల్లా పంచాయతీ అధికారి పద్మజారమణ స్థలాలను రక్షించాలని ఆదేశించారు.

ఫిర్యాదు చేసినా స్పందన అంతంతే..

ప్రస్తుతం మరియపురానికి దగ్గరలో వైపీఆర్ వెంచర్‌కు వెళ్లే దారిలో అక్రమార్కులు కబ్జా చేశారు. సుమారు 2,400 గజాలకు పైగా కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు. దీనిపై అనేకమార్లు కలెక్టర్, సీడీఎంఏ, డీటీసీపీ కార్యాలయాల్లో స్థానికులు పలువురు ఫిర్యాదు చేశారు. ఎలాంటి విచారణ చేయకుండా స్థానికంగా ఉండే టౌన్‌ప్లానింగ్, మున్సిపల్ అధికారులు తప్పుడు సమాచారం ఇస్తూ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రూ.12 కోట్ల విలువైన భూమి కబ్జా చేసినా పట్టించుకునే నాథుడే లేడని, కంటితుడుపు చర్యగా ప్రహరీ లోపల ఎవ్వరికీ కనిపించకుండా చిన్నబోర్డు పాతి వదిలేశారని పేర్కొన్నారు. అక్రమార్కుల కబంధ హస్తాల్లో ఉన్న విలువైన భూమికి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.



పార్కు స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ

“ విలువైన స్థలాలను కాపాడాలి



గత పంచాయతీ హయాంలో పార్కు స్థలాలను పంచాయతీకి గిఫ్ట్‌డీడ్ చేశారు. అప్పటి నుంచి కాపాడుతూ వచ్చారు. మున్సిపాలిటీ ఏర్పడ్డాక అధికారుల పర్యవేక్షణ కరువైంది. అక్రమార్కులపై కేసులు పెట్టి విలువైన స్థలాలను కాపాడాలి.

– పల్లె రజినీకాంత్‌గౌడ్, ఆదిబట్ల

ఉపేక్షించేది లేదు



టీసీఎస్ ముందున్న రియల్ ఎస్టేట్ సంస్థలో పార్కు స్థలం కబ్జాకు గురైన విషయం తెలిసింది. తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఎవ్వరినీ ఉపేక్షించేది లేదు. ఇప్పటికే ప్రహరీలో బోర్డు ఏర్పాటు చేశాం. అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తాం.

– బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదిబట్ల

కారు బీభత్సం

- రోడ్డు పక్కన నిలబడిన వారిపైకి దూసుకెళ్లిన వాహనం
- వలస కూలీ మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- కడ్తాల్‌లోని శ్రీశైలం- హైదరాబాద్ రహదారిపై ఘటన


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది


ప్రమాదానికి కారణమైన కారు

కడ్తాల్: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం ఓ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చి, రోడ్డు పక్కన నిలబడిన వారిని ఢీకొడుతూ ఫుట్‌పాత్‌ల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదం బారిన పడిన దంపతుల్లో భర్త మృతిచెందగా, భార్యతో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని చల్లంపల్లి వద్ద ఓ తోటలో కూలీ పనులు చేసేందుకు ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా, నల్లమడ మండలం, కొండ్రవారిపల్లికి చెందిన జిన్నె రంగులు(54), ఆదిలక్ష్మి దంపతులతో పాటు నర్సపూర్ కిష్టప్ప శుక్రవారం ఉదయాన్నే బస్సులో ఏపీ నుంచి కడ్తాల్‌కు వచ్చారు. చల్లంపల్లి వెళ్లేందుకు శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన నిలబడి ఆటోల కోసం వేచి చూస్తుండగా హైదరాబాద్ నుంచి డిండి వైపు వెళ్తున్న ఓ కారు అతి వేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో రంగులు, ఆదిలక్ష్మిని అంబులెన్స్‌లో ఉస్మానియాకు కిష్టప్పను వెల్దండలోని యెన్నం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం రంగులు మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

ఉదయం ఆరు గంటలకే జరిగిన ఘటనతో పెను ప్రమాదమే తప్పింది. అదుపు తప్పిన కారు అతివేగంగా దూసుకొచ్చి రోడ్డు పక్కన నిలబడిన వారితో పాటు చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న కొట్టులను ఢీకొడుతూ ముందుకు వెళ్లింది. అప్పటికీ షాపులు తీయకపోవడం, వేకువజామునే కావడంతో జనసందడి లేకపోవడంతో ప్రమాద తీవ్రత తగ్గిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రధాన కూడలిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొనసాగుతున్న వ్యాపారాలను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జేపీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

కొత్తూరు: మండల పరిధి ఇన్ముల్‌నర్వ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ జేపీదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబాకు చాదర్ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చాదర్ సమర్పిస్తున్న నవీన్‌కుమార్ రెడ్డి, అంజయ్య యాదవ్

పోలీసుల విధులకు ఆటంకం

ఇద్దరు యువకులకు రిమాండ్

ఆమనగల్లు: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడికి యత్నించిన ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. ఈ నెల 4న రాత్రి ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు వద్ద విధి నిర్వహణలో ఉన్న ఎస్బీ కానిస్టేబుల్‌పై కోనాపూర్‌కు చెందిన వినయ్,శివ మద్యం మత్తులో దాడికి యత్నించారు. దీంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నలుగురు నకిలీ వైద్యులపై కేసులు

సాక్షి, సిటీ బ్యూరో: ఎలాంటి అర్హతలు లేకుండా వైద్యం చేస్తున్న నలుగురు నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు కేసులు నమోదు చేశారు. శివరాంపల్లి, కాటేదాన్, బాలాపూర్ ప్రాంతాల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యుడు ఇమ్రాన్ పలు ఆసుపత్రులు, క్లినిక్‌లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి విద్యార్హత లేని అశోక్ కుమార్, మోహన్‌గౌడ్, నరేష్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అంతేగాక వారు నిబంధనలకు విరుద్ధంగా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇవ్వడం, రోగులకు ప్రిస్క్రిప్షన్ రాస్తున్నారని కౌన్సిల్ ఉపాధ్యక్షుడు డా.శ్రీనివాస్ తెలిపారు. గురురాజ్ గురుపాద్ (బీహెచ్ఎంఎస్) అల్లోపతి వైద్యం చేస్తున్నారని, అతడిపై గతంలో కేసు నమోదైనా తీరు మారలేదన్నారు. మరో ముగ్గురు నకిలీ వైద్యులు తమ క్లినిక్‌లకు తాళాలు వేసి పారిపోయినట్లు తెలిపారు. మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు కేసులు నమోదు చేసి, తదుపరి చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వైద్యం చేస్తున్నట్లు గుర్తిస్తే 9154382727 నెంబర్‌కు వాట్సాప్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

సిటీ పోలీసులోకి 'లాడెన్ జాగిలాలు'

- బెల్జియం మలినాయిస్ జాతివి సైతం కొనుగోలు
- తొలిసారిగా నేరుగా ఖరీదు చేసిన సిటీ పోలీసులు
- 11.5 ఎకరాల్లో కెన్నెల్స్, స్టేబుల్స్
- సీవీ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌లో దాక్కున్న అల్ ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ ఆచూకీ కనుగొనటం కోసం అమెరికన్ నేవీ సీల్స్ 2011లో వినియోగించిన బెల్జియం మలినాయిస్ జాతి జాగిలాలు నగర పోలీసు విభాగంలో అందుబాటులోకి రానున్నాయి. సిటీ పోలీసులు కొత్తగా ఖరీదు చేసిన 12 జాగిలాల పిల్లల్లో ఆరు బెల్జియం మలినాయిస్ జాతివే ఉన్నాయి. దేశంలోనే ఈ తరహా జాగిలాలను నేరుగా ఎంపిక చేసి, అందుబాటులోకి తీసుకువస్తున్న తొలి పోలీసు విభాగంగా హైదరాబాద్ కమిషనరేట్ కావడం గమనార్హం. పోలీసు విభాగం సుదీర్ఘకాలం జర్మన్ షెపర్డ్, లాబ్రెడార్ తదితర జాతి జాగిలాలకు శిక్షణ ఇచ్చి వినియోగించింది. అయితే మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహిస్తున్న సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ (సీఆర్పీఎఫ్) కొన్నేళ్ల క్రితం 300 బెల్జియం మలినాయిస్ జాగిలాలను ఖరీదు చేసి వినియోగించడం ప్రారంభించింది. 2015లో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషనల్ విభాగమైన ఆక్టోపస్‌లో వినియోగించడానికి ప్రయోగాత్మకంగా మూడు (రెండు మగ, ఒక ఆడ) బెల్జియం మలినాయిస్ జాగిలాలను ఖరీదు చేశారు. వీటి పనితీరును అధ్యయనం చేసిన నగర పోలీసు అధికారులతో కూడిన కమిటీ సర్వకాల సర్వావస్థల్లోనూ విసుకు, విరామం లేకుండా ఏకధాటిగా పని చేయడం, పౌరుషం తదితర లక్షణాలను పరిగణలోకి తీసుకుంది. దశల వారీగా నగర పోలీసు విభాగంలో బెల్జియం మలినాయిస్, బీగల్ జాతి జాగిలాల సంఖ్యను పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. బెల్జియం మలినాయిస్ జాతి జాగిలం గరిష్ఠంగా 12 ఏళ్లు జీవిస్తుంది. ఇది 22 నుంచి 26 అంగుళాల వరకు ఎత్తు పెరుగుతుంది. 20 నుంచి 30 కేజీల బరువు కలిగి ఉంటుంది. పౌరుషం, సంగ్రహణ శక్తుల్లో ఉత్తమమైన వీటికి శిక్షణ ఇవ్వడం కూడా చాలా తేలిక.

త్వరలో నిర్మాణాలు ప్రారంభిస్తాం

గోషామహల్‌లోని పోలీసుస్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రికి తీసుకోగా మిగిలిన 11.5 ఎకరాల్లో త్వరలో నిర్మాణాలు ప్రారంభించనున్నాం. వీటిలో ఓపక్క అశ్వకదళం (మౌంటెడ్ పోలీసు) కోసం స్టేబుల్స్, మరోపక్క జాబితాల కోసం కెన్నెల్ నిర్మించనున్నాం. ప్రస్తుతం సిటీ పోలీసు విభాగంలో ఉన్న 50 గుర్రాల్లో మూడు తప్ప మిలినవి అన్నీ యాక్టివ్‌గా ఉన్నాయి. కీలక సందర్భాల్లో క్రౌడ్‌కంట్రోల్‌కు ఇవి అత్యంత కీలకం. 2003లో నేను సెంట్రల్ జోన్ డీసీపీగా ఉండగా చేప ప్రసాదం పంపిణీలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో రోగులు రావడంతో తొక్కిసలాట వరకు విషయం వెళ్లినా... అక్కడ ఉన్న మౌంటెడ్ పోలీసు రంగంలోకి దిగడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

– సీవీ ఆనంద్, నగర కొత్వాల్

విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు


చేవెళ్ల: ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న ఏసీపీ కిషన్, మాలతి తదితరులు


షాద్‌నగర్: మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

చేవెళ్ల ఏసీపీ కిషన్

చేవెళ్ల: విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులని చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మాలతి విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో జ్ఞానం అనే వెలుగులు ప్రసాదించేది తల్లిదండ్రుల తరువాత గురువులే అన్నారు. అనంతరం విద్యార్థులను అడిగి పాఠశాల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాలతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన ఆట స్థలంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, నాయకులు ఎస్.కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలువలు నేర్పేది గురువే: ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్: విద్యార్థులకు జీవిత విలువలను నేర్పించేది గురువులేనని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని, ఉపాధ్యాయుడు లేని సమాజాన్ని ఊహించలేమని అన్నారు. విద్యార్థుల్లోని చీకటిని తొలగించి వెలుగులు నింపేవారే ఉపాధ్యాయుడని అన్నారు. ప్రతీ విజయంలో కీలక పాత్ర గురువుదేనని అన్నారు. విద్యార్థులు గురువులను దైవంగా భావిస్తూ వారి సూచనలు సలహాలు పాటిస్తూ ముందుకు సాగితే విజయతీరాలకు చేరుకుంటారని అన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఉపాధ్యాయులు మంచి పునాదులు వేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ, వైస్ ప్రిన్సిపాల్ నాగరాణి, ఏబీవీ ఆస్పత్రి వైద్యులు ఆనంద్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని చిదిమేసిన కారు


విరాట్(ఫైల్)

షాద్‌నగర్ రూరల్: ఇంటి ఎదుట ఆడుకుంటున్న బాలుడిని కారు రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. ఈ ఘటన శుక్రవారం పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్వర్ తెలిపిన ప్రకారం.. కొందర్గు మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన బుట్ట గోపికృష్ణ, మీనాక్షి దంపతులకు ఇద్దరు కుమారులు. గోపికృష్ణ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో కుటుంబతో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరి కుమారుడు విరాట్(2) ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. గోపికృష్ణ ఇంటి పక్కనే ఖాళీ స్థలం ఉండడంతో అదే కాలనీకి చెందిన అన్వేష్ తన థార్ వాహనాన్ని పార్క్ చేస్తున్నాడు. ఆయన తన వాహనాన్ని వెనక్కు తీస్తున్న క్రమంలో కారు వెనకాల ఉన్న చిన్నారిని గమనించలేదు. దీంతో బాలుడు వాహనం చక్రాల కింద పడిపోయాడు. వెంటనే గమనించి షాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

ఆమనగల్లు: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తలకొండపల్లి మండలం జూలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఇంద్రకంటి నర్సింహ(45)కు ఇరవై ఏళ్ల క్రితం పద్మతో వివాహమైంది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన నర్సింహ ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉరేసుకున్నాడు. మృతుడి అన్న కుమారుడు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాబీలాన్ పబ్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలకు ఉల్లంఘించి గడువు ముగిసిన తర్వాత అర్ధరాత్రి దాకా కొనసాగుతున్న పబ్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36/10లో ఉన్న బాబీలాన్ పబ్ నుంచి గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా పెద్ద ఎత్తున శబ్దాలు వినిపిస్తుండడంతో పాటు ప్రజలు గుమికూడడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆరా తీయగా గడువు ముగిసిన తర్వాత కూడా డీజే కొనసాగించడంతో పాటు కస్టమర్లకు మద్యం సరఫరా చేస్తున్నట్లు తేలింది. దీంతో బాబీలాన్ పబ్ మేనేజర్ ఆసిఫ్‌తో పాటు డీజే ఆర్టిస్ట్ యశ్వంత్‌పై కేసు నమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం

అత్తాపూర్: గణేశ్ నిమజ్జనానికి వెళుతూ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఇటుక లారీ ఢీకొనడంతో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐలు చిలుకల శ్రీను, జయరాజ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన సన్నీ(15) స్నేహితులతో కలిసి శుక్రవారం తెల్లవారుజామున గణేష్ నిమర్జన కార్యక్రమంలో పాల్గొన్నాడు. పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే 310 పిల్లర్ వద్ద రోడ్డు దాటుతుంగా వేగంగా వచ్చిన ఇటుక లోడ్ లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సన్నీ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలింపు చేపట్టారు.

ఫోన్ విషయంలో గొడవ.. యువకుడి హత్య

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని ఆశా ఆస్పత్రి వద్ద ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని గౌరీశంకర్‌కాలనీకి చెందిన ఈ.శ్రీధర్ (30) ఈవెంట్స్‌లో పనిచేస్తుంటాడు. గురువారం ఉదయం అతను తన స్నేహితుడిని బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లో బైక్‌పై దింపి తిరిగి వస్తుండగా ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. దీంతో ఆశా హాస్పిటల్ వాచ్‌మెన్ వెంకటయ్యను ఫోన్ ఇవ్వాలని, తన ఇంటికి అర్జెంటుగా ఫోన్ చేసుకోవాల్సి ఉందని, తన ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యిందని చెప్పాడు. అయితే తన ఫోన్‌లో బ్యాలెన్స్ లేదని వాచ్‌మెన్ వెంకటయ్య చెప్పడంతో నేను అడిగితే ఫోన్ ఇవ్వవా అంటూ శ్రీధర్ అతడితో వాగ్వివాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శ్రీధర్‌ను వాచ్‌మెన్ వెంకటయ్యతో పాటు హరికృష్ణ, తరుణ్ అనే వ్యక్తులు సెల్లార్‌లోకి తీసుకెళ్లి చితకబాదారు. అతను అక్కడికక్కడే శ్రీధర్ కుప్పకూలాడు. అప్పటికే బయట వేచి ఉన్న శ్రీధర్ పరిచయస్తులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అతడి భార్య బాధితుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు వెంకటయ్య, హరికృష్ణ, తరుణ్‌లపై బీఎన్ఎస్ కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవుడి సన్నిధికి వెళ్తున్నానని..

భార్యకు వాట్సాప్ మెసేజ్ పెట్టి భర్త అదృశ్యం

ఫిలింనగర్: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో ఇంట్లో నుంచి అదృశ్యమైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని ఛత్రపతి శివాజీనగర్‌కు చెందిన నరేష్ ఈ నెల 3న భార్య లలితతో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి లోనైన నరేష్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. భార్య పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అయితే రాత్రి నేను దేవుడి దగ్గరకు వెళ్తున్నానంటూ భార్యకు వాట్సాప్ మెసేజ్ పెట్టాడు. దీంతో ఆందోళనకు గురైన లలిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నరేష్ కోసం గాలింపు చేపట్టారు.

టీఎస్ఈఏఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్(టీఎస్ఈఏఈఏ) నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. ఈ నెల 2న నిర్వహించిన ఓటింగ్‌లో నాలుగు విద్యుత్ సంస్థలకు చెందిన 2500 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. తాజాగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టింది. జి.పవన్‌కుమార్(అధ్యక్షుడు), కె.కుమారస్వామి(అసోసియేట్ ప్రెసిడెంట్) టి.మహేష్(జనరల్ సెక్రటరీ), కె.రామకృష్ణ(అదనపు జనరల్ సెక్రటరీ), ఎం.చందు(అడ్మిన్ సెక్రటరీ), శ్రీపాల్‌రెడ్డి(ఆర్థిక కార్యదర్శి), హెచ్ రంజిత్ రెడ్డి(సాంకేతిక కార్యదర్శి), వి.మహిపాల్(ప్రచార కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదే విధంగా జెన్‌కో ఉపాధ్యక్షుడిగా ఆర్ కిరణ్‌కుమార్, కంపెనీ కార్యదర్శిగా జి.శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ట్రాన్స్‌కో ఉపాధ్యక్షుడిగా పి.రజినీకాంత్, కంపెనీ కార్యదర్శిగా బి.నరేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎస్పీడీసీఎల్ ఉపాధ్యక్షుడిగా జి.దయానంద్, కంపెనీ కార్యదర్శిగా సందీప్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్పీడీసీఎల్ ఉపాధ్యక్షునిగా టి.నవీన్, కంపెనీ కార్యదర్శిగా దిలీప్‌కుమార్ ఎన్నికైనట్లు టీఎస్ఈఏఈఏ ప్రకటించింది.

ఆరాంఘర్ చౌరస్తాలో లారీ బోల్తా

అత్తాపూర్: ఆరాంఘర్ చౌరస్తాలో లారీ బోల్తాపడింది. దీంతో ఆరాంఘర్ చౌరస్తాలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మహారాష్ట్ర కళ్యాణ్ నుంచి నగరంలోని సిద్ధి అంబర్‌బజార్‌కు శనగపప్పు లోడుతో వస్తున్న లారీ ఆరాంఘర్ చౌరస్తాలో శుక్రవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో సిగ్నల్ వద్ద డివైడర్‌ను ఢీకోని బోల్తాపడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లోడ్‌తో ఉన్న లారీని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పక్కకు తీసేందుకు ప్రయత్నించారు. డ్రైవర్ నిద్రమబ్బు కారణంగానే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమించిన అమ్మాయి దక్కలేదని..

యువకుడి బలవన్మరణం

మోమిన్‌పేట: ప్రేమించిన అమ్మాయి దక్కలేదని ఓ యువకుడు బలవన్మరణానికి పా ల్పడ్డాడు. ఈ ఘటన మోమిన్‌పేటలో గురు వారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ అర వింద్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన దప్పు నరేందర్(21) తాండూర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయనకు ఓ అమ్మాయితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో ఆమెను మూడు నెలల క్రితం తన ఇంటికి తీసుకువచ్చాడు. సదరు అమ్మాయి తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం యువతిని ఇంటికి తీసుకెళ్లారు. ప్రేమి ంచిన అమ్మాయి దక్కలేదనే బాధతో ఇంట్లో ఫైప్‌నకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఏసయ్య ఫిర్యాదు మేర కు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇక్ఫాయ్ గుర్తింపు రద్దు చేయాలి

- బీఆర్ఎస్వీ నేతల డిమాండ్
- యూనివర్సిటీ గేట్ ఎదుట ఆందోళన



ఇక్ఫాయ్ కళాశాల గేటు ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

శంకర్‌పల్లి: ఇక్ఫాయ్ డీమ్డ్ యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీ గేటు ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడటం బాధాకరమైన విషయమన్నారు. నిర్వాహకుల అసమర్థతతోనే ఈదుస్థితి నెలకొందని మండిపడ్డారు. యూనివర్సిటీలో డ్రగ్స్, గాంజా విక్రయాలు, వినియోగం అధికంగా ఉందన్నారు. ఎనిమిది మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా అందరూ డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడం ఇక్కడి పరిస్థితిని సూచిస్తోందని తెలిపారు. ఇంత జరుగుతున్నా యాజమాన్యం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదిశగా చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. విషయం తెలుసుకున్న మోకిల సీఐ ఆందోళనకారులను అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. వీరిలో బీఆర్ఎస్వీ హైదరాబాద్ సెక్రటరీ రహమత్, నాయకులు శ్రీకాంత్, నాగేంద్రబాబు, రాకేశ్, దయాకర్, అఫ్రిద్, విజయ్, ఆసిఫ్, పృథ్వీ, రవికుమార్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

సాక్షి,సిటీబ్యూరో: మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-1 పథకంలో భాగంగా ముర్మూర్, మల్లారం , కొండపాక పంపింగ్ స్టేషన్ల పరిధిలో పంపింగ్ మెయిన్ వాల్వుల మార్పిడి పనుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఈ నెల 9న ఉదయం 6 గంటల నుంచి 48 గంటల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి ప్రకటించింది. ఎస్ఆర్‌నగర్ సనత్‌నగర్, బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంకట్రావు నగర్, ఎల్లారెడ్డిగూడ, సోమజిగూడ, ఫతేనగర్ సెక్షన్లు, జూబ్లీహిల్స్,తాటిఖానా లాలాపేట్, తార్నాక కొంత భాగం, కూకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానందనగర్, ఎల్లమ్మబండ, మూసాపేట్, భారత్‌నగర్, మోతీనగర్, గాయత్రీనగర్, బాబానగర్, కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, హస్మత్‌పేట్ సెక్షన్లు, చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్‌నగర్, గజులరామారం, సూరారం, ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ సెక్షన్, అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, వెంకటాపురం, మచ్చబొల్లారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయి నగర్, యాప్రాల్, చాణక్యపురి, గౌతమ్‌నగర్, సాయినాథ్‌పురం సెక్షన్, మౌలాలి రిజర్వాయర్, చర్ల పల్లి, సాయిబాబానగర్, రాధికా సెక్షన్లు, కైలాసగిరి పాత, కొత్త రిజర్వాయర్ ప్రాంతాలు, హౌసింగ్ బోర్డు సెక్షన్, మల్లాపూర్ కొంత భాగం, కొండాపూర్, డోయెన్స్, మాదాపూర్, గచ్చిబౌలి, నల్లగండ్ల కొంత భాగం.హఫీజ్‌పేట్, మియాపూర్ సెక్షన్, పాచారం, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, తూముకుంట, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం సెక్షన్, అయ్యప్పకాలనీ రిజర్వాయర్ ప్రాంతాలు., నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, గండిమైసమ్మ, తెల్లాపూర్, బోల్లారం, బౌరాంపేట్ సెక్షన్లు, త్రిశూల్ లైన్స్, గన్‌రాక్, హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్, సికింద్రాబాద్ కాంటోన్మెంట్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మహిళా వర్సిటీ విద్యార్థినులకు ఫోన్ కాల్స్‌పై కేసు

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలోని 100కు పైగా విద్యార్థినుల ఫోన్లు హ్యాక్‌చేసి సైబర్ నేరగాళ్లు వేధింపులకు పాల్పడుతున్నారని శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై సుల్తాన్‌బజార్ పోలీసులు స్పందించారు. ఈ విషయంపై విద్యార్థినుల ఫిర్యాదులు స్వీకరించి కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నర్సింహ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని ఫోన్‌కాల్స్‌పై తమకు మహిళా యూనివర్సిటీ నుంచి ఫిర్యాదు అందిందన్నారు. విద్యార్థులకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్, వాట్సాప్ కాల్స్ వస్తున్నట్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కాల్ చేసేవారు విద్యార్థుల హాజరు, సబ్జెక్ట్ కాంబినేషన్‌లు, సున్నితమైన వ్యక్తిగత ఆరోగ్య వివరాలను అడిగినట్లు తెలిపారు. వైవాహిక స్థితి, గైనిక్ హెల్త్ సమాచారం, ఫొటోలు, 18 నుంచి 25 ఏళ్ల విద్యార్థినుల ప్రొఫైళ్లను అడిగేవారని విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హాస్టల్ విద్యార్థులను టార్గెట్ చేసుకుని ఫోన్లు చేసి వేధించేవారని తెలిపారు. విద్యార్థుల డేటాను ఎలా హ్యాక్ చేశారనే దానిపై విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ ఆందోళన వ్యక్తం చేశారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.